ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జనగామ
శుక్రవారం 12 జూలై 2024



యువకుడి.. ఉన్మాదం

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి తల్లిదండ్రులపై వేటకత్తితో దాడి



నిందితుడు మేకల నాగరాజు

- భార్యను దూరం చేశారన్న కక్షతో నరికి చంపిన వైనం
- గాఢ నిద్రలో ఉండగా ఘాతుకం
- భార్య, ఆమె సోదరుడిపైనా దాడి.. తీవ్రగాయాలు
- వరంగల్ జిల్లా పదహారు చింతల్‌తండాలో ఘటన



బానోతు శ్రీనివాస్ మృతదేహం



సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సుగుణ, శ్రీనివాస్ దంపతులు (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 11: కూతురి ప్రేమ, పెళ్లి వ్యవహారం ఆ దంపతుల దారుణ హత్యకు దారి తీసింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను పెద్దల్లో పంచాయితీ పెట్టి విడదీశారని యువతి తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్న ఆ యువకుడు.. వారి పాలిట కాలయముడయ్యాడు. గాఢ నిద్రలో ఉన్న వారిపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత మార్చాడు. ఇక ఈ దాడిలో ఆ యువకుడి భార్య, ఆమె సోదరుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల్ తండాలో జరిగిన గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణ ఘటన కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. పదహారు చింతల్ తండాకు చెందిన బానోతు శ్రీనివాస్ (40) బానోతు సుగుణ (35) దంపతులకు ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆ దంపతుల కూతురు దీపిక హనుమకొండలోని పింగిళి కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, కుమారుడు మదన్‌లాల్ అమీనాబాద్ మోడల్ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ఇక గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన మేకల నాగరాజు(బన్నీ) అనే యువకుడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ.. నిత్యం గుండెంగ నుంచి నెక్కొండకు ఆటోను నడుపుతుంటాడు. అయితే గతంలో

మిగతా 7వ పేజీలో..

నర్సంపేటలో ఉద్రిక్తత

'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో

ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ.. ఆందోళన విరమణ

7

కేసీఆర్‌ను కలిసిన 'పల్లా'



పల్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేసీఆర్

జనగామ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన 58వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ పల్లాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దొరలను ఎదిరించిన ధీరవనిత చాకలి ఐలమ్మ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఐలమ్మ విగ్రహ విష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం, ఎమ్మెల్సీ సారయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: తన పంటను రక్షించుకోవడానికి గాను 75ఏళ్ల క్రితం విస్నూరు దొరలను ధైర్య సాహసాలతో ఎదిరించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కొనియాడారు. గురువారం డివిజన్ కేంద్రంలో రజకసంఘం నాయకులు ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి కడియం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధపోరాటానికి నాంది పలి కిన ధిశాలీ ఐలమ్మ అని, ప్రతీ ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకొని అన్యాయాలపై మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. నేడు యువత అన్యాయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, ధైర్యంగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, నరేంద ర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, బూర్ల శంకర్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, గట్టు రమేష్, పెసరు సారయ్య, రామకృష్ణ, రాజేష్, శ్రీనివాస్, పొన్న రవి, ఉపేందర్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, మదార్, మధుకుమార్, రమేశ్, శివ, గౌతమ్, చింతల్ పాల్గొన్నారు.

రూ.500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

6

అదనంగా అర ఎకరం కబ్జా!

- కేటాయింపు కంటే 20 గుంటలు ఆక్రమణ
- పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ నేతల చర్య
- నోటీసులు అందించిన రెవెన్యూ అధికారులు



అదనంగా ఉందని అధికారులు చెబుతున్న స్థలం ఇదే..

జనగామ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిర్మాణంలో అప్పటి బీఆర్ఎస్ నేతలు కబ్జాకు పాల్పడ్డారు. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయిస్తే అదనంగా మరో అర ఎకరం స్థలాన్ని ఆక్రమించేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇది జరగగా తాజాగా అధికారులు జరిపిన సర్వేలో ఈ విషయం బయట పడింది. దీంతో అధికారులు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి నోటీసులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణాల్లో భాగంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో అన్ని జిల్లాల్లో స్థలాలను కేటాయించింది. చాలా వరకు జిల్లాల్లో గజానికి రూ. 1 నుంచి రూ. 100 కే కారుచౌకగా అప్పటి ప్రభుత్వం కట్టబెట్టింది. ఇందులో భాగంగా జనగామ మండలం యశ్వంతాపూర్ శివారులోని 82 సర్వే నంబరులో ఉన్న ఎకరం భూమిని గజానికి రూ. 100 చొప్పున అధికారులు కట్టబెట్టారు. పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కావాలంటూ అప్పటి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దివంగత పాగాల సంపత్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో అధికారులు యశ్వంతాపూర్‌లోని 82 సర్వే నంబరులో ఉన్న ఎకరం స్థలాన్ని కేటాయించారు. దీనికి గానూ గజానికి రూ. 100 చొప్పున ఎకరం స్థలానికి రూ.4.84 లక్షలను ప్రభుత్వ ఖాతాలో బీఆర్ఎస్ పార్టీ జమ చేసింది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించగా బీఆర్ఎస్ నేతలు మాత్రం మరో అర ఎకరం స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేశారు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఆక్రమణ జరిగిందనే విషయం అప్పటి అధికారులకు తెలిసినప్పటికీ చూస్తూ ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ ఆక్రమణపై దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాలకు ఇచ్చిన స్థలాల విషయంలో ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో జనగామ రెవెన్యూ అధికారులు జనగామ బీఆర్ఎస్ కార్యాలయానికి ఇచ్చిన స్థలంలో సర్వే చేశారు. సర్వే చేయగా ప్రభుత్వం ఇచ్చిన ఎకరా కంటే అదనంగా మరో 20 గుంటల స్థలాన్ని ఆక్రమించి నట్లు నిర్ధారించారు. దీంతో ఈనెల 9న బీఆర్ఎస్ పార్టీకి జనగామ రెవె న్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు జిల్లా అధ్యక్షుడు లేకపోవడంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కార్యాల యంలో అధికారులు నోటీసులు ఇచ్చారు. అదనంగా ఆక్రమణలో ఉన్న స్థలానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు ఉన్నా నోటీసులు అందిన 15 రోజుల్లోగా తమను సంప్రదించాలని నోటీసుల్లో అధికారులు పేర్కొన్నారు. కాగా.. ఈ నోటీసులపై బీఆర్ఎస్ నేతలు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

వీధికుక్క దాడిలో ఇరువురికి తీవ్రగాయాలు

- ఓ వ్యక్తికి తెగిపడ్డ చిటికన వేలు

చిలుపూర్, జూలై 11 : వీధి కుక్క దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో పాటు, చిటికెన వేలు తెగిపడ్డ సంఘటన మండలంలోని కృష్ణాజీగూడెంలో జరిగింది. గురువారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అంకం సత్యం అనే ఎలక్ట్రీషియన్ మెకానిక్ వ్యక్తిగత పని నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్ వెళ్ళేందుకు బస్టాండ్ వద్దకు వచ్చి పక్కనే ఉన్న సిమెంట్ బెంచీపై కూర్చున్నాడు. అప్పటికే బెంచీపక్కన పడుకుని ఉన్న ఓ వీధికుక్క ఒక్కసారిగా అతడిపై దాడి చేసి కరిచింది. దాన్ని విదిలిస్తున్న క్రమంలో అతడి కుడిచేతి చిటికన వేలిని కొరికి గాయపరచింది. దీంతో వేలు చేతినుంచి విడిపోయి కిందపడింది.

ఈ క్రమంలో పక్కనే మరోవ్యక్తి బక్క మల్లేష్ కుక్కను తరిమేందుకు ప్రయత్నించగా అది అతడిపై కూడా దాడి చేసి కరచి గాయపరచింది. సమాచారమందుకున్న వారి కుటుంబ సభ్యులు బాధితులను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.



వీధికుక్క దాడిలో గాయపడ్డ సత్యం, తెగిపడ్డ చిటికన వేలు

పారదర్శకతే.. లక్ష్యం!

'మీ సేవ'లో నగదు రహితం



జనగామలో క్యూఆర్ కోడ్ విధానం అమలు తీరును పరిశీలిస్తున్న ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గారావు



- మీసేవ కేంద్రాల్లో క్యాష్‌లెస్ చెల్లింపులకు శ్రీకారం
- క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్స్
- అక్రమ వసూళ్లకు ఇక చెక్
- సేవల్లో పారదర్శకతకు పెద్దపీట
- తొలుత 42 రకాల రెవెన్యూ సేవలకు అమలు
- జిల్లాలో 52 మీసేవ కేంద్రాలు

జఫర్‌గడ్, జూలై 11 : మీసేవ కేంద్రాల నిర్వహణలో అధిక వసూళ్లకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. కేంద్రాల్లో అందించే పౌర సేవలకు నిర్వాహకులు దరఖాస్తుదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ క్రమంలో పౌరులకు పారదర్శక సేవలను అందించేందుకు సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జవాబుదారీతనం ఉండాలని.. ప్రజలు నేరుగా డబ్బులు చెల్లించకుండా ఈ నెల 1వ తేదీ నుంచి క్యాష్‌లెస్ (నగదు రహిత) సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కేంద్రాల ప్రారంభం నుంచి ఈ ఏడాది జూన్ వరకు వివిధ రకాల ధృవ పత్రాలు, సేవలను వినియోగించుకున్న వారు మీసేవ కేంద్రాల్లో నేరుగా డబ్బులు చెల్లించే వారు. అయితే నిర్వాహకులు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అధికారులకు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ సర్కార్ కొత్త విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. తొలుత 42 రకాల రెవెన్యూ సేవల చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ లేదా టీ-వ్యాలెట్ ద్వారా నగదు రహిత చెల్లింపులు చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 52 మీసేవ కేంద్రాల్లో ఈ నూతన విధానం ప్రక్రియను అమలు చేస్తున్నారు.

'క్యూఆర్' కోడ్ ద్వారా చెల్లింపులు...

నూతన విధానం అమలు నేపథ్యంలో ఇకపై అన్ని మీ సేవ కేంద్రాల్లోనూ క్యూఆర్ కోడ్ లేదా టీ - వ్యాలెట్ స్కాన్ ద్వారా డబ్బులు చెల్లించాలి. సంబంధిత ధృవీకరణ పత్రం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం పూర్తి కాగానే.. చెల్లింపు కోసం పేమెంట్ ఆప్షన్ వస్తుంది. ఏ ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారు..? ఇందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎంత..? అనేది మొబైల్‌కు సమాచారం వస్తుంది. దీంతో పాటు లింకు కూడా వస్తుంది. ఆ మేరకు దరఖాస్తు దారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు జరపాలి. స్కాన్ చేసి డబ్బులు బదలాయింపు జరగగానే రసీదు ప్రింట్ వస్తుంది. ఈ క్యాష్‌లెస్ విధానం అమలు ద్వారా పౌరుల నుంచి అదనపు వసూళ్లకు అవకాశం ఉండదు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే చెల్లింపులు..

మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. గతంలో మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడే అవకాశం ఉండేది. దరఖాస్తుదారు ఏ ధృవీకరణ పత్రానికి ఎంత చెల్లించాలనేది తెలిసేది కాదు. ప్రభుత్వ ధరలపై ఎవరేని అడిగినా సర్వీస్ చార్జీలు, జిరాక్స్‌లు, ప్రింట్ ఇచ్చినందులకు ఖర్చులని .. అదనంగా డబ్బులు వసూలు చేసేవారు. గ్రామాల్లో చాలా వరకు అవగాహన లేకపోవడం, అధికంగా వసూలు చేసినట్లు తెలిసినా.. ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడం లో ఇబ్బందులు, దూరాభారాన్ని దృష్టిలో ఉంచుకుని వారు ఎంత చెబితే అంత చెల్లించాల్సిన దుస్థితి. ప్రస్తుతం అమలు చేస్తున్న నగదు రహిత చెల్లింపుల ప్రక్రియ వల్ల నిర్ణీత రుసుము మాత్రమే చెల్లించే అవకాశం కలగనుంది.

42 రకాల క్యాష్‌లెస్ రెవెన్యూ సేవలు ఇవే..

లైసెన్స్‌డ్ సర్వేయర్స్ దరఖాస్తు ఫారం, కులం, నివాసం, ఈబీసీ, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్, పుట్టిన తేదీ, ఆదాయ ధృవీకరణ పత్రాలు, నో ఎర్నింగ్ మెంబర్ సర్టిఫికేట్, కుటుంబ సభ్యుల, అనాథల సంబంధిత సర్టిఫికెట్, పాన్ బ్రోకర్, మనీ లెండింగ్, నో ఆబ్జెక్షన్, పొసెషన్ సర్టిఫికేట్, ఆపద్బంధు పథకం, జనన, మరణ రిజిస్ట్రేషన్, వ్యవసాయ భూముల విలువ పత్రాలు, సినిమా లైసెన్స్ రెన్యూవల్, నో ప్రాపర్టీ అప్లికేషన్ సర్వీ స్, పేరు మార్పిడి దరఖాస్తులు, వ్యవసాయ బోరు బావులు, తాగునీటి బావుల తవ్వకాలకు అనుమతి, ట్రేడ్ డిపాజిట్ రిఫండ్, రన్ ది బెనిఫిట్ షో పర్మి షన్, సినిమా హాల్ నిర్మాణానికి అనుమతులు, ఇనాం భూముల హక్కు పత్రాలు, తదితర మొత్తం 42 రకాల రెవెన్యూ సేవలకు నగదు రహిత చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.

నూతన విధానంలో సమస్యలు...!

అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న క్యాష్ లెస్ నూతన విధానం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయని పౌరులు, అటు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, విద్యార్థులు ఏదేని ధృవపత్రాల కోసం కేంద్రాలకు వెళ్లినపుడు వారి వద్ద స్మార్ట్ ఫోన్‌లు లేకపోవడంతో స్కాన్ చేసి యూపీఐ ద్వారా దరఖాస్తు రుసుము చెల్లించలేని స్థితి. ఈ విధానం గూర్చి తెలియకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నగదు రహిత క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపుల ప్రక్రియ మంచిదేనని, అయితే ఈ నూతన విధానంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకతకు అవకాశం ఉంటుంది : దుర్గారావు, ఈడిస్ట్రిక్ట్ జిల్లా మేనేజర్, జనగామ



మీసేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపుల విధానం అమలు ద్వారా పారదర్శకతకు అవకాశం ఉంటుంది. పౌరుల నుంచి అదనంగా డబ్బుల వసూలుకు అడ్డుకట్ట పడనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుంచి అన్ని మీసేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోంది. పైలెట్ ప్రాజెక్టుగా తొలుత రెవెన్యూశాఖకు సంబంధించిన 42 రకాల లావాదేవీలు క్యాష్‌లెస్ చెల్లింపులు చేయనున్నారు. తదనంతరం మిగతా సేవలు కూడా క్యూఆర్ కోడ్, టీ-వ్యాలెట్ ద్వారానే చెల్లింపులకు ఏర్పాట్లు చేపడతాం. ప్రభుత్వ ఆదేశాలను అన్ని కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలి.

వచ్చే ఏడాదిలో రూ.500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: వచ్చే ఏడాదిలో రూ.500కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించానని తెలిపారు. 15ఏళ్లలో నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. 2023లో తాను గెలిచినా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు అందజేశానన్నారు. వాటిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు కోసం నిధులు, స్టాఫ్‌ను మంజూరు చేయాలని, డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని ఆస్పత్రికి ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగినప్పటికీ డివిజనల్ ఆఫీసులు సరిగ్గా పని చేయడం లేదన్నారు. డివిజినల్, సబ్ డివిజినల్ మొత్తం 15 కార్యాలయాలు ఒకే చోట పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌ల కాంప్లెక్స్‌ను (సమీకృత రెవెన్యూ డివిజినల్ కార్యాలయాల సముదాయం) నిర్మించడానికి ప్రతిపాధనలు సీఎంకు ఇచ్చానని తెలిపారు. 50వేల స్క్వేర్ ఫీట్‌ల విస్తీర్ణంతో కాంప్లెక్స్‌ను నిర్మాణం చేయాలని, 15 కార్యాలయాలు ఒకే దగ్గర ఉండి ప్రజలకు సేవలు అందించేలా ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఘన్‌పూర్-నవాబుపేట దేవాదుల మెయిన్ కెనాల్, సబ్ కెనాల్స్ లైనింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6 ప్రధానమైన ఆర్అండ్‌బీ రోడ్లను రూ 120 కోట్లతో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇచ్చానని, చిలుపూర్, వేలేరు మండల కేంద్రాలలో మండల కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రూ 500 కోట్ల విలువైన వివిధ పనులు చేయాలని మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పక్కాగా రుణమాఫీ, రైతు భరోసా అమలు

ప్రతిపక్షపార్టీలు అనేక మాటలు మాట్లాడినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసాను పక్కాగా అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. గత పదేళ్ల కాలంపాటు బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించబోతున్నారని. యువతను రెచ్చగొడుతున్న బీజేపీ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికైన ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. రాముడిపేరు చెప్పుకొని రాజకీయాలు చేసే బీజేపీ నిరుద్యోగులకు చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. ఏరకంగా ప్రభుత్వాన్ని నడిపారు ఏ రకంగా అవినీతిని పెంచి పోషించారు.. కుటుంబానికే పరిమితమైన అధికారం, కుటుంబానికే పరిమితమైన అవినితి, కుటంబానికే పరిమితమైన అహంకారం వల్లనే కదా బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. అయినప్పటికీ జ్ఞానోదయం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ వలసలగూర్చి మాట్లాడే నైతికత కేసీఆర్ కుటుంబానికి లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలను విలీనం చేసుకొని రాజకీయ వ్యవస్థకు విలువలు లేకుండా చేసింది, భ్రష్టుపట్టించింది మీరు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు వలసల గూర్చి అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం వేరేవాళ్లు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఎందుకు ద్వంద్వనీతి అని మండిపడ్డారు. చట్టం తనపని తాను చేసుకుంటుంది తప్పకుండా కోర్టులు, స్పీకర్లు స్పందిస్తారని తెలిపారు. రాజకీయ వలసల గూర్చి స్పీకర్‌గాని కోర్టులుగాని వారి అభిప్రాయాలను చెబుతాయని హితవుపలికారు. నాశనం పట్టించిన కేసీఆర్ చివరకు ఏ ఒక్క రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకొని ప్రతిపక్షాల నోళ్లు మూయించిన మీరు ఇప్పుడు పూనీతులు అయినట్లుగా తప్పుచేయని వారిగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, నాగరబోయిన యాదగిరి, బూర్ల శంకర్, రాజాక్‌యాదవ్, గుర్రం రాజు, తోట సత్యం, నీల శ్రీధర్, గన్ను నర్సింహులు, నీరటి ప్రభాకర్, చింత ఎల్లయ్య, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న పదహారుచింతల్ తండావాసులు

నర్సంపేటలో ఉద్రిక్తత

- 'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో
- ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ రవీందర్.. ఆందోళన విరమణ



హనుమకొండలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట టౌన్, జూలై 11: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ మృతుల కుటుంబ సభ్యులు, తండావాసులు నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్, అమర వీరుల స్థూపం సెంటర్లలో గురువారం ఆందోళనలు చేశారు. ఆందోళనకారుల్లో ఓ యువకుడు పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఉద్రిక్తతకు దారితీసింది. హత్యకు గురైన దంపతులు బానోతు సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం నర్సంపేటకు తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పదహారుచింతల్ తండావాసులు, మృతుల బంధువులు, గిరిజన సంఘాలు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిందితుడిని ఉరితీయాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. టౌన్ సీఐ రమణమూర్తి, పోలీసు సిబ్బంది వారికి ఎంత నచ్చచెప్పినా ఆందోళన విరమించలేదు. ఈ సమయంలో తండాకు చెందిన ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంటానని హెచ్చరించడంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడినా మంత్రి సీతక్క రావాలని, కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం సెంటర్ వద్దకు చేరుకొని సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పట్టణంలో రాస్తారోకో ఆందోళనలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అమరవీరుల స్థూపం వద్ద జరుగుతన్న ఆందోళన వద్దకు చేరుకున్న డీసీపీ రవీందర్.. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో సెల్‌ఫోన్ ద్వారా గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడించారు. చట్ట ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పోస్టుమార్టం గది వద్ద మిన్నంటిన రోదనలు

పోస్టుమార్టం గది వద్ద మృతుల కూతురు, కుమారుడు చేసిన రోదనలు మిన్నంటాయి. తీవ్రగాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు.. తల్లిదండ్రులను చివరి చూపునకు వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనను చూసిన అక్కడికి వచ్చిన వారి కంటతడిపెట్టారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : పెద్ది

సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పెద్ది స్వప్న సందర్శించి, వారి కుమారుడు, కూతురిని పరామర్శించారు. అనంతరం రాస్తారోకోకు వద్దకు చేరుకున్న పెద్ది మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మృతుల కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు మృతుల కూతురు, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని, పోలీసులు, అధికారులు అధికార పార్టీ నాయకుల చెప్పులు మోసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాంతిభద్రతలను పరిరక్షించడం లేదన్నారు. ఇక తన సొంత మండలానికి చెందిన మృతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు.

రూ.లక్ష సాయం అందించిన పెద్ది

బాలసముద్రం: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ దంపతుల కూతురు దీపిక, కుమారుడు మదన్ గాయాలతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వారిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. నిందితుడికి వెంటనే కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉదయం నుంచి గిరిజన సంఘాలు నిందితుడిని శిక్షించాలని నిరసనలు తెలిపినా ప్రజాపతినిధులు, అధికారులు పట్టించు కోవట్లేదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తెలిపారు. దీపిక, మదన్‌ను చికిత్స అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి తన వాహనంలో చెన్నారావుపేటలోని పదమూరు చింతల్ తండాకు తీసుకెళ్లారు.

పోలీసుల అదుపులో నాగరాజు

వరంగల్ క్రైం, జూలై 11: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్‌తండాకు చెందిన భార్యాభర్తలైన బానోతు శ్రీను, సుగుణల హత్య కేసులో నింధితుడు నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్య దీప్తి కాపురానికి రావడంలో లేదనే ఆగ్రహంతో ఆమెను చంపేందుకు వచ్చి అడ్డుపడిన శ్రీను, సుగుణ దంపతులను నాగరాజు హత్య చేశాడు. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడి అరెస్టు విషయాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ధ్రువీకరించారు. దీప్తి తల్లిదండ్రులపై నిందితుడు కత్తితో దాడి చేసి హత్య చేసినట్లుగా విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు.



నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అడ్డుకుంటున్న దృశ్యం (సర్కిల్‌లోని వ్యక్తి)



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

యువకుడి ఉన్మాదం



పదహారు చింతల్‌తండాలో హత్య జరిగిన ప్రదేశంలో ఉన్న రక్తపు మడుగు

(5వ పేజీ తరువాయి)

దీపిక అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న సమయంలో నాగరాజు తన ఆటోలో ఎక్కించుకొని పాఠశాల వద్ద దింపేవాడు. ఇలా దీపిక, నాగరాజుల మధ్య పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. అనంతరం డిగ్రీ కోసం హన్మకొండకు వెళ్లిన దీపిక అక్కడే హాస్టల్‌లో ఉంటోంది.

దీపికను పెళ్లి చేసుకున్న నాగరాజు..

హన్మకొండలోని హాస్టల్‌లో ఉంటున్న దీపికను గత నవంబరులో హైదరాబాద్‌లోని ఓ దేవాలయంలో రహస్య వివాహం చేసుకున్న నాగరాజు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. వారం రోజుల తర్వాత దీపిక తల్లి సుగుణ.. హాస్టల్ ఉందనుకున్న తన కూతురు కనిపించడం లేదంటూ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత తల్లిదండ్రు లను ఫోన్ చేసిన దీపిక.. తాను నాగరాజు అనే యువకుడిని వివాహం చేసుకున్నానని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పింది. దీంతో దీపిక తల్లి సుగుణ హైదరాబాద్ లోని తన కూతురు వద్దకు వెళ్లి, నచ్చ జెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

భార్యను తన నుంచి విడదీశారని కక్ష కట్టి..

సుగుణ కూతురు దీపికను హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకువచ్చిన తర్వాత.. దీపిక, నాగరాజు ప్రేమ, పెళ్లి విషయంలో ఇటు దీపిక తల్లిదండ్రులు, నాగరాజు పరస్పరం చెన్నారావుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ తర్వాత పెద్ద మనుషుల మధ్య పంచాయితీ నిర్వహించగా.. దీపిక, నాగరాజు ఎవరికి వారు విడిగా ఉండాలని తీర్మానించగా.. అందుకు ఇరు కుటుంబాల వారు అంగీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన నాగరాజు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న దీపికను తన నుంచి దూరం చేశారని దీపిక కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మళ్లీ గుండెంగ గ్రామానికి వచ్చి తిరిగి ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో పదహారు చింతల్‌తండాలో ఉన్న దీపిక ఇంటి వద్ద ఇటీవల రెక్కీ నిర్వహించాడు. పథకం ప్రకారం గురువారం తెల్లవారుజామున 1.30గంటల సమయంలో నాగరాజు వేట కత్తితో ద్విచక్ర వాహనంపై దీపిక ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి వరండాలో దీపిక, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణ గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన నాగరాజు తొలుత సుగుణపై, ఆ తర్వాత శ్రీనివాస్‌పై, దీపికపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి కేకలు విని ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు మదన్‌లాల్ బయటకు వచ్చాడు. దాంతో అతనిపై కూడా నాగరాజు కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మృతి చెందింది. దీపిక, మదన్‌లాల్ కేకలు వస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో చట్టు పక్కల వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చి నాగరాజును అడ్డుకునే ప్రయత్నం చేయగా వారి వైపు కత్తి చూపుతూ అడ్డొస్తే అందరినీ చంపుతా అంటూ బెదిరిస్తూ.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఆతర్వాత తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతడూ మృతిచెందాడు. దీపిక, మదన్ లాల్‌ను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తండావాసుల సమాచారంతో ఎస్ఐ గూడ అరుణ్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసుల ఆదుపులో నిందితుడు?

జంట హత్యలకు కారకుడైన మేకల నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హత్యలు చేసి పరారైన నాగరాజు గుండెంగలోని ఓ పాఠశాలకు చేరుకుని కత్తితో చేయి కోసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి నాగరాజును అదుపులోనికి తీసుకున్నట్టు సమాచారం. నాగరాజుకు సహకరించాడనే అనుమానంతో అతడి స్నేహితుడిపై తండావాసులు దాడిచేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, వెంటనే ఆ యువకుడిని చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో పోలీసు బందోబస్తు

జంట హత్యల అనంతరం పదహారు చింతల్‌తండాతో పాటు గుండెంగలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు నర్సంపేట, మహబూబాబాద్‌కు చెందిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాక్ స్వాడ్ బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డీసీపీ రవిందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, గూడూరు సీఐ బాబురావు, నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థుల ద్వారా హత్య జరిగిన తెలుకున్నారు. సీఐ రమణమూర్తి, ఖానాపురం ఎస్సై రఘుపతి, నర్సంపేట ఎస్సై ప్రవీణ్, గూడూరు ఎస్సై నగేష్, చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఇక దీపిక తల్లిదండ్రుల అంత్యక్రియలు గురువారం రాత్రి ముగిశాయి.

న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదం

పదహారు చింతల్ తండాలో జంట హత్యకు పాల్పడ్డ నాగరాజును శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ తండావాసులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిని ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. నాగరాజును తమకు తక్షణమే అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఉదయం 10గంటల వరకు గ్రామస్థులు ఆందోళన కొనసాగించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా కృషి చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



తండాలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సర్వర్ డౌన్‌తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రాంనగర్, జూలై 11: రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్ కావడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల సమయంలో రాష్ట వ్యాప్తంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగలేదు. హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం నాలుగు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ప్రతీరోజు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వంద వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోగా, రిజిస్ట్రేషన్ శాఖకు ఈరోజు పెద్దఎత్తున ఆదాయానికి గండిపడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కాకపోవడంతో తప్పని పరిస్థితిలో వెనుతిరిగారు.

27మంది ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైల బదిలీలు జరిగాయి. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.శ్రీనివాస్	వీఆర్	ఐనవోలు పోలీస్ స్టేషన్
టి.ప్రశాంత్‌బాబు	ఐటీ సెల్	నల్లబెల్లి
బి.రామారావు	నల్లబెల్లి	సుబేదారి
ఎన్.వెంకటేశ్వర్లు	వంగర	దుగ్గొండి
జె.పరమేశ్వర్	దుగ్గొండి	వీఆర్
ఎన్.నగేష్	వీఆర్	నర్మెట్ట
కె.శ్రీకాంత్	నర్మెట్ట	సుబేదారి
కె.కుమార్	మట్టెవాడ	గీసుగొండ
ఎ.శ్రీకాంత్	మిల్స్‌కాలనీ	పరకాల
బి.ప్రవీణ్	నర్సంపేట	ఆత్మకూరు
బి.రాంచరణ్	వీఆర్	కేయూసీ
ఎ.సురేష్	కేయూసీ	వీఆర్
ఎస్.రాజన్‌బాబు	మహిళా పీఎస్	వరంగల్ ట్రాఫిక్
డి.సాంబయ్య	సుబేదారి	సీసీఎస్ వరంగల్
ఎం.సురేష్	హసన్‌పర్తి	మిల్స్‌కాలనీ
ఎం.రాజు	హసన్‌పర్తి	సీసీఎస్ వరంగల్
టి.కృష్ణమూర్తి	పీసీఆర్ వరంగల్	సీఎస్‌బీ వరంగల్
ఎస్‌కె.హమీద్	వీఆర్	నర్సంపేట
డి.దేవేందర్	కేయూసీ	హసన్‌పర్తి
బి.రాజేష్‌కుమార్	వీఆర్	జనగామ
ఎం.సిద్ధయ్య	వీఆర్	హసన్‌పర్తి
డి.నినిషారెడ్డి	వీఆర్	సీసీఎస్ వరంగల్
బండారి రాజు	ధర్మసాగర్	సీఎస్‌బీ వరంగల్
టి.యాదగిరి	సీసీఎస్	వరంగల్ వరంగల్ ట్రాఫిక్
ఎం.డి.నజీర్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
కె.సారంగపాణి	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
జి.రమేశ్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్

ఫీడర్లపై భారం లేకుండా ఏర్పాట్లు చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 11 : ఓవర్ లోడ్ భారం పడే ఫీడర్లను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల సర్కిళ్ల నోడల్ ఆఫీసర్లతో సీఎండీ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఆయిల్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. పీక్ లోడ్ సమయంలో కుడా చెక్ చేయాలన్నారు. ప్రతీ పోల్‌కు నంబరింగ్ చేయాలని, ఆ నెంబర్స్ ద్వారా సమస్యలను సులభంగా గుర్తించి సమస్యలను త్వరిగతిన పరిష్కరించవచ్చన్నారు. పవర్ ఫాక్టర్‌లో మెరుగదల ఉండాలన్నారు. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్స్ కాకుండా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కిషన్, రవీంద్రనాద్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, ఎస్ఈ సివిల్ అంకూస్, కంపెనీ సెక్రెటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ ఎదుట ఆందోళన

కేయూ క్యాంపస్, జూలై 11: రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను మూడు నెలల పాటు వాయివా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట ఉపాధ్యక్షుడు బినరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం కేయూ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహారావు, మంద నరేశ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు మానసిక సన్నద్ధత, ప్రిపరేషన్, సిలబస్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వాయిదా కోసం ఉద్యమిస్తున్న ఓయూ విద్యార్థులపై దాడులను ఖండించారు. పోలీసుల భౌతికదాడులను విరమించుకోవాలని అన్నారు. పరీక్షలు వాయిదా వేయకపోతే విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అభిరామ్ రమేశ్, డీస్సీ అభ్యర్థులు శ్రీకాంత్‌రెడ్డి, పృథ్వీ, క్రాంతికిరణ్, శారద, మల్లేశ్, నాగరాజు, రవీందర్, లక్ష్మణ్, అనిల్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్; కేయూఅధ్యక్షుడు దూడపాక నరేందర్, కార్యదర్శి బండారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదివేందుకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, జూలై 11: విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్స్ చదివేందుకు మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో చదువుకునేందుకు అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ లోపు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన అనంతరం దరఖాస్తు ప్రతులను హనుమకొండ కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమ ర్పించాలని పేర్కొన్నారు.

వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

వేలేరు(ధర్మసాగర్), జూలై 11: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరిత గురువారం తెలిపారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా, అదేగ్రామానికి చెందిన పింగిలి సంపత్‌రెడ్డి ఈనెల 9న మధ్యాహ్నం ఇంట్లోకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తప్పించుకొని ఇంట్లో నుంచి తన ఇంటి పక్కనే ఉన్న తన పెద్దమ్మ ఇంట్లోకి వెళ్లింది. అక్కడే ఉన్న స్థానికుడు అనువుల ఎల్లారెడ్డి అతడిని అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో సంపత్‌రెడ్డితో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని గురువారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



సీఎంను సన్మానిస్తున్న కుడా ఛైర్మన్ ఇనుగాల

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఇంకా ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలతో పాటు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిలను కలిసి వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించారు. వారు సైతం కుడా ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాడి సాధించుకున్న భూములు కొనుగోలు చేయద్దు..

జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

వరంగల్ క్రైం, జులై 11: హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లి గ్రామ ప్రజలు భూస్వామి పెసలు రాంచంద్రారెడ్డితో పోరాడి సాధించి సాగుచేసుకుంటున్న భూములను ఎవరు కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే వదిలిపెట్టాలని భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్బంధాలు లెక్కచేయకుండా పోరాడి రాంచంద్రారెడ్డికి చెందిన 20 ఎకరాల భూమిని ఆక్రమించి 35 యేళ్ల నుంచి 42 మంది దళితులు సాగుచేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కాస్తులో, కబ్జాలో వీరే ఉన్నారని, రెవెన్యూ రికార్డుల్లోనూ వీరే ఉన్నారని ఆయన వివరించారు. ఆ భూముల ధరలు పెరగడంతో గ్రామానికి చెందిన తిక్క దేవేందర్ మావోయిస్టు పార్టీ పేరు చెప్పి రాంచంద్రారెడ్డి వారసులతో ఒప్పందం చేసుకుని దళితుల భూములను అమ్ముతున్నాడని అన్నారు. అమ్మడానికి ఒప్పుకోని వారిని బెదిరింపులకు గురిచేస్తూ కేసులు పెట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఆ భూములు దక్కే వరకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి ఆక్రమించుకున్న భూములను ఎవరూ కొనుగోలు చేసినా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వెంకటేశ్ హెచ్చరించారు.

నేడు ఫార్మసీ విభాగంలో విస్తృత ఉపన్యాసం

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీసు- ఏ టూల్ ఫర్ బెటర్ పేషెంట్ కేర్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి. ప్రసాద్ గురువారం తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ రమేశ్ అడెపు హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి కేయూ దూరవిద్య కాంట్రాక్టు తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎం.ఎస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు జూలై 13నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని జువాలజీ సెమినార్ హాల్‌లో తరగతులు జరుగుతాయని అడ్మిషన్లు పొందిన వారందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలి

జనగామ రూరల్, జూలై 11: డీఎస్సీ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నాయకులు, విద్యార్థులు జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద మోకాళ్ల నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళంపల్లి రాజు మాట్లాడుతూ నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తుందనే ముఖ్య ఉద్దేశ్యంతో నిరుద్యోలందరు కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నేరవేర్చలేదని మండిపడ్డారు. నిరుద్యోగులకు అండగా ఉంటానన్న ఎమెల్సీలు తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్, ప్రొఫెసర్ కోదండరామ్ ఎందుకు స్పదించడం లేదని ప్రశ్నించారు. వెంటనే డీఎస్సీ పరీక్షలను చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గన్ను కార్తీక్, అసర్ల సుభాష్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ మార్కెట్‌లో పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలి

జనగామ రూరల్, జూలై 11: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన పత్తి యార్డులో సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘ నాయకులు గురువారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్‌లో 2006లో రూ. 3కోట్ల 18 లక్షలతో నిర్మించిన పత్తి యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే పత్తి యార్డును ఉపయోగంలోకి తీసుకొని వచ్చి పత్తి పంటను సీసీఐ ద్వారా క్వింటాకు రూ. 12 వేల మద్దతు ధరకు ఈ యేడాది నుంచి కొనుగోలు చేయాలని కోరారు.

గడ్డం సమ్మయ్యకు సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి

దేవరుప్పుల, జూలై 11: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందుయక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ వాసవీ బృందావనం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరుగగా కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సమ్మ య్యను ఘనంగా సన్మానించి సత్కరించారు.

కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

జఫర్‌గడ్ :మండల బీజేపీ అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో నాగేశ్ గౌడ్‌తో పాటు మండల ఉపాధ్యక్షులు మోడెం అరవింద్, ప్రధాన కార్యదర్శులు సింగారపు రమేశ్, గోదారి సాయిరాం, లింగమూర్తి, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గాదెపాక శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు రడపాక ఆదాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే 'పల్లా' జన్మదిన వేడుకలు

జనగామ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి 58వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పల్లా జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ శ్రేణులు జిల్లాకేంద్రంలోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పుష్పగుచ్చాలు అందించి, శాలువాలు కప్పి ఎమ్మెల్యేతో కేకు కోయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య జనగామలో గురువారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసం వద్ద స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎమ్మెల్యేలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఉన్నారు.

● చిలుపూర్ : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్టలో ఎమ్మెల్యే పల్లా జన్మదిన ఘనంగా నిర్వహించారు. సోమవారం గురువారం ఆ పార్టీ మండల కో ఆర్డినేటర్ జనగామ యాదగిరి నేతృత్వంలో కేక్‌లు కోసి సంబరాలు జరుపుకున్నారు. పల్లా యువసేన వ్యవస్థాపకులు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, నారగోని రవిచంద్ర, మోటం రాములు, తాళ్లప ల్లి క్రాంతికుమార్, నారగోని రాజుగౌడ్, బత్తుల రాజన్‌బాబు, చొక్కయ్య పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : జనగామ నియోజకవర్గ ప్రజలు తనపై చూపుతున్న అభిమానాన్ని మరువలేనని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు వీఎస్ఆర్ నగర్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించగా, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మెన్ పులిగిళ్ల పూర్ణచందర్, నాయకులు బోడిగం చంద్రారెడ్డి, బావండ్ల కృష్ణంరాజు, విద్యాసాగర్‌గౌడ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



జనగామలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

● జనగామ రూరల్ : జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో పల్లా జన్మదిన సందర్భంగా రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎండీ మాజీద్, రఘు ఠాకూర్, కొలనుపాక శివరాజ్‌పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బర్త్‌డే వేడుకలను గురువారం డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అంబేద్కర్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి నాయకులు పంపిణి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, ఆకుల కుమార్, మహేందర్ రెడ్డి, చల్లా చందర్ రెడ్డి, కనకం గణేష్, కుంభం కుమార్, ఓగ్గు రాజు, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేషం పాల్గొన్నారు.

చదువే లక్ష్యంగా ముందుకు సాగాలి

- మోడల్ స్కూల్స్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి



ఆదర్శ పాఠశాలలో జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి తదితరులు

జఫర్‌గడ్, జూలై 11 : విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని మాడల్ స్కూల్స్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి సూచించారు. గురువారం ఆమె జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి మంజరితో కలిసి జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాల/కళాశాలను ఆకస్మింగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాబోధన, పాఠశాల విద్యాభివృద్ధికి ప్రణాళికల తయారీ, సౌకర్యాల కల్పన, పరిశుభ్రత వంటి అంశాలతో పాటు బాలికల వసతి గృహంలో భోజనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ బడుల పథకం కింద పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను ఆమె పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది నుంచి ఇంటర్ మీడియట్‌లో సైతం యూనిట్ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యా సంవత్సర ప్రణాళికలను రూపొందించుకుని పక్కాగా అమలు చేయాలన్నారు. బోధన, పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ డైరీస్, వార్షిక ప్రణాళికలు, పాఠశాలలో నిర్వహించే పరీక్షలు వంటి అంశాలపై జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి సమీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నష్కల్ ఆలయంలో గుప్తనిధుల వేట

చిలుపూర్, జూలై 11 : మండలంలోని నష్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... గ్రామ సమీపంలో ఉన్న పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో మట్టి కుప్పలు కనిపించడంతో కొంతమంది యువకులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయం లోపలి భాగంలో పెద్ద గొయ్యిని తవ్వినట్లు గుర్తించి పోలీసులతో పాటు, స్థానిక నాయకులకు సమాచారమందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు కర్ణకంటి స్వప్న -వెంకటేశ్, పాశం శిరీష -సురేశ్, బీజేపి మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ ఆలయాన్ని సందర్శించారు.

శ్రీనివాస్ సేవలు ప్రజలు మరువలేనివి

-మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అన్నాల శ్రీనివాస్ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జూలై 11: కడవెండి మాజీ సర్పంచ్ అన్నాల శ్రీనివాస్ సేవలు మరువలేనివని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కడవెండిలో శ్రీనివాస్ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్ స్మారకస్థూపం వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు, గాంధీనాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, నాయకులు బస్వ మల్లేశం, కొల్లూరు సోమయ్య, ఏల సుందర్, అలకుంట్ల రత్నాకర్‌రెడ్డి, యాదగిరి, జోగు సోమనర్సయ్య, సుడి గెల హన్మంతు, తాటాపెల్లి మహేష్, వంగ అర్జున్, గడ్డం రాజు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణలో జిల్లా మొదటి స్థానం

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్, జూలై 11: కుటుంబ నియంత్రణలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ పిహెచ్‌సీలో ఏఎస్ఎం, ఆశ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై మాట్లాడుతూ కుటుంబ నియంత్రణలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని వైద్య సిబ్బందిని అభినందించారు. కుటుంబ నియంత్రణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులపై ఈ బాధ్యత ఉంటుందని తెలిపారు. అనంతరం కుటుంబ నియంత్రణలో సేవలందించిన జిల్లా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాల్ రావు, సర్జన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీదేవి, తదితరులకు బహుమతి, మెమెంటోలను ప్రధానం చేశారు.

కేసీఆర్ వైఖరి నచ్చకే కాంగ్రెస్‌లోకి చేరికలు

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ నియంతృత్వ ధోరణి, అక్రమాలు నచ్చకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం పద్ధతి కాదని కేసీఆర్ ప్రస్తుతం మాట్లాడ డం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకుంటే తప్పేంటి అన్నట్లుగా కేసీఆర్ వెటకారంగా మాట్లాడారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేల చేరికలపై మాట్లాడే నైతిక అర్హత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు లేదని అన్నారు. ఉద్యమకారులను ఏనాడూ గౌరవంగా చూడలేదని, ఉద్యమ ద్రోహులకు మాత్రం మంత్రి పదవులు ఇచ్చారని మండిపడ్డారు. 2010లో సోనియాగాంధీ తెలంగాణ ఇస్తా అంటే ఇవ్వకుండా కేసీఆరే అడ్డుకున్నారని విమర్శించారు. అధికారంలోకి ఉన్న పదేళ్లలో ఏ ఒక్క హామీని నిలబెట్టలేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్క హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ పోతోందని అన్నారు. కేసీఆర్ నిజస్వరూపం అందరికీ అర్థమైందని, అందువల్లే ప్రజలు ఎన్నికల్లో ఛీత్కరించారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని మండిపడ్డారు. పదేళ్లలో నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. కాగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిర్మాణం పేరుతో యశ్వంతా పూర్‌లో అదనంగా కబ్జా చేసిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కేటాయించిన దానికంటే అర ఎకరం స్థలాన్ని బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ కట్టారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి కబ్జా చేసిన స్థలంలో కట్టిన కాంపౌండ్ వాల్ తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, నాయకులు వంగాల మల్లారెడ్డి, నర్సింగ రావు, చెంచారపు బుచ్చిరెడ్డి, బనుక శివరాజ్‌యాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

క్షణికావేశంలో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

● హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో ఘటన ● పోస్టుమార్టం అనంతరం సొంతూరు మారెపల్లిగూడేనికి మృతదేహం తరలింపు ● తనను కొడతారేమోనన్న భయంతో చిలుపూర్ పీఎస్‌లో లొంగిపోయిన తండ్రి

చిలుపూర్, జూలై 11 : కన్నతండ్రే తనను అనుమానిస్తున్నాడని మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని సందెల శైలజ(14) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్‌లో జరిగింది. అయితే ఈ ఘటనలతో బంధువులు తనపై అనుమానం వ్యక్తం చేయడంతో పాటు, భౌతికదాడికి పాల్పడతారేమోనన్న భయంతో మృతురాలి తండ్రి శివ తన కుమార్తె మృతదేహంతో జనగామ జిల్లా చిలుపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం లొంగిపోయాడు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట కాసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి కూకట్‌పల్లి సీఐ క్రిష్ణమోహన్, జనగామ జిల్లా రఘునాథపల్లి రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఐ ముత్యం రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామానికి చెందిన సందెల శివ చిలుపూర్ మండలంలోని పల్లగుట్ట శివారులో ఉన్న మారెపల్లి గూడేనికి చెందిన దివ్యను వివాహం చేసుకున్నాడు. వారికి శైలజ జన్మించగా.. ఆమె చిన్నతనంలోనే దివ్య చనిపోయింది. దీంతో శివ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తికి చెందిన రేణుకను రెండో వివాహం చేసుకున్నాడు. రెండోభార్యకు ఇద్దరు కుమా ర్తెలు కాగా, జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి కారుడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, తన మొదటి భార్య కుమార్తె అయిన శైలజ మారెపల్లిగూడెంలోని అమ్మమ్మ ఇంట్లోనే ఉండి చదువుకుంటోంది. ప్రస్తుతం జనగామ జిల్లా జఫర్‌గడ్ కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. ఇటీవల శైలజ అనారోగ్యానికి గురవడంతో తండ్రి శివ ఆమెను హాస్టల్ నుంచి బుధవారం హైదరాబాద్‌లోని తన ఇంటికి తీసుకెళ్లాడు. గురువారం తన పినతల్లి ల్యాబర్తిలోని పుట్టింటికి వెళ్లగా.. కారు ఎప్పటి లాగే డ్రైవింగ్‌కు వెళ్లిన శివ ఇంటికి వచ్చే సరికి కూతురు శైలజ ఉరేసుకుని ఉంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడ శైలజ రాసిన సూసైడ్ నోట్ దొరకగా అందులో 'డాడీ నన్ను అనవసరంగా అనుమానించకు. ఎవరితో ఎలాంటి తప్పు చేయలేదు. అనుమానం ఉంటే నాకు మ్యారేజీ చెయ్.. లేదంటే చనిపోయిన మా మమ్మీ వద్దకే వెళ్తా.. డాడీ ప్లీజ్' అని రాసి ఉంది. దాని ఆధారంగా కూకట్‌పల్లి పోలీసులు కేసు నమో దు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం సాయంత్రం శివ తన కూతురి మృతదేహాన్ని తీసుకుని అంబు లెన్స్‌లో మారెపల్లిగూడెం బయల్దేరాడు. కానీ గ్రామంలోకి వెళితే బంధువులు తనపై భౌతిక దాడికి పాల్పడతారన్న భయంతో అంబు లెన్స్‌ను చిలుపూర్ పీఎస్‌కు తీసుకెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. కాగా శైలజ బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. అయితే ఆత్మహత్యకు ముందు శైలజ రాసిన సూసైడ్ నోట్‌ను పరిగణనలోకి తీసుకుని కేసు నమోదు చేశామని కూకట్‌పల్లి సీఐ క్రిష్ణమోహన్ ఫోన్‌లో తెలిపగా.. చిలుపూర్ పోలీసులు మాత్రం శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట బాలిక మృతదేహం



శైలజ (ఫైల్)

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తరిగొప్పుల, జూలై 11: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వాచ్‌ఉమెన్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేసేందుకుగాను కాంట్రాక్టు ప్రాతిపాదికన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి గోవింద్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో విద్యార్థుల సంఖ్యరీత్యా పనిచేందుకు నైట్‌వాచ్ ఉమెన్ పోస్టు(1), స్కావెంజర్ పోస్టు(1) ఖాళీగా ఉన్నాయన్నారు. వాచ్‌ఉమెన్ పోస్టుకు పదో తగతి విద్యార్హత, స్కావెంజర్ పోస్టుకు 7వ తరగతి విద్యార్హతగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పోస్టులకు తరిగొప్పుల మండలంలోని అర్హులైన అభ్యర్థులందరూ ఈ నెల 13వ తేది లోపు స్థానిక కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అభ్యర్థులకు ఏదైన సందేహాలు నివృత్తి చేసుకునేందుకు సెల్ నెంబరు 97018 92112 నెంబరుకు కాల్ చేయాలని ఆమె తెలిపారు.

యాసిడ్ ఆనవాళ్లు లేవు : ఎస్‌వో

తరిగొప్పుల, జూలై 11: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థిని శివరాత్రి ఇందు తాగిన వాటర్ బాటిల్‌లో ఎలాంటి యాసిడ్ ఆనవాళ్ల లేవని పాఠశాల ప్రత్యేకాధికారి గోవింద్ రజిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో 8వ తరగతతి చదువుతున్న విద్యార్థిని శివరాత్రి ఇందు యాసిడ్ కలిపిన వాటర్ తాగిందంటూ వార్త పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా వైద్యాధికారులు స్పందించి పరిశీలించిన పిదప బాలిక వాడిన వాటర్ బాటిల్‌లోని నీటి పరిశీలించి ఎలాంటి యాసిడ్ ఆనవాళ్లు లేవని నిర్ధారించారన్నారు. విద్యార్థిని వాడి వాటర్ బాటిల్ పరిశుభ్రంగా లేకపోవడంతో ప్లాస్టిక్ వాసన వచ్చి విద్యార్థిని ఆందోళన చెందిదని ఆమె పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కొడకండ్ల, జూలై 11 : మండలంలోని పెదబావి తండాలో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిల ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధిపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని వీధులన్నీ తిరిగి అభివృద్ధి పనులను, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సోమనర్సయ్య, గ్రామపార్టీ అధ్యక్షుడు భిక్షపతి, మసురం రవీందర్, సునీల్ రెడ్డి, కలీం, రాంకోటి, అంజయ్య సుమన్, జగన్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతి మేలు : డీఏవో

పాలకుర్తి, జూలై 11 : వ్యవసాయంలో మార్పులకు అనుగుణంగా రైతులు కూడా అదే పద్ధతిని పాటించాలని జనగామ జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని విస్నూరులోని గ్రామ రైతు బర్ల యాకయ్య పంట పొలాలను సందర్శించారు. ఈ పద్ధతి ద్వారా కలుపు సమస్య ఉంటుందని, సమయానుకూలంగా కలుపు నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలిపారు. ఆయన వెంట ఏడీఏ పరుశురామ్, ఏఈవో వెంకటేష్, రైతులు కుమార్, రాములు ఉన్నారు.

ఉపాధ్యాయుల హామీలను నేరవేర్చాలి

జనగామ కల్చరల్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం జనగామ మండలంలోని వివిధ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, బి.శ్రీధర్, శ్రీనివాస్, మహేష్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

జనగామ రూరల్, జూలై 11: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులందరికీ అన్ని కార్పొరేట్ హస్పటల్‌లో నగదు రహిత సేవలు, పెండింగ్‌లో ఉన్న డీఆర్, డీఏలను విడుదల చేయాలనీ, పీఆర్సీ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పలు అభివృద్ధి పనులకు కొమ్మూరి శంకుస్థాపన

జనగామ రూరల్, జూలై 11: జనగామ మండలంలోని శామీర్‌పేట, యశ్వంతపూర్, పెంబర్తి, సిద్దెంకి, ఓబుల్ కేశవపూర్, గోపరాజుపల్లి, వడ్లకొండ గ్రామాలలో సీడీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. నిమ్మతి మహేందర్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, అం బాల అంజనేయులు గౌడ్, బండారు సిద్దులు, బనుక శివరాజ్ యాదవ్, బడికె ఇంది రా, చెంచారపు బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్, జూలై 11: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నేరవేర్చాలన్నారు. ఉడుగుల రమేష్, పిట్టల సత్యం, శివరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

బడిలో చేరిన బాల కార్మికులు

జనగామ రూరల్, జూలై 11: బాల కార్మికులుగా మారుతున్న చిన్నారులకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రారంభించిందని జనగామ ఎస్సై తిరుపతి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ఓ ఇండస్ట్రియల్‌లో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కి చెందిన పలు కుటుంబాలకు చెందిన 8 మంది విద్యార్థులను ఆపరేషన్ ముస్కాన్ టీం గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు..

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగాలఘణపురం, జూలై11: జిల్లాలో ఉపాధ్యాయుల స్పౌజ్ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అదనపు పాయింట్లను దుర్వినియోగం చేసిన ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి రాము గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 10న 'హెచ్‌ఆర్ఏ కోసం అడ్డదారులు.. స్పౌజ్ బదిలీల్లో నిబంధనలకు నీళ్లు..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డీఈవో రాము స్పందించారు. ఈ మేరకు భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధ్యా య ఉద్యోగులైన వారికి ప్రభుత్వం మానవీయ కోణంలో ఇచ్చిన 10 అదనపు పాయింట్లను దుర్వినియోగం చేసిన వారిపై జిల్లా విద్యాశాఖ ప్రాథమిక విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఏడుగురు ఉపాధ్యాయులను గుర్తించిన అధికారులు వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. పూర్తిస్థాయి విచారణ అనంతరం వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో తెలిపారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

జనగామ రూరల్, జూలై 11: న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులను ఖండిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్ర ఋషి ఆధ్వర్యంలో గురువారం జనగామ కోర్టులో న్యాయవాదు లు విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్ర ఋషి మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని, న్యాయవా దులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్.సిద్దులు, జాన్‌రెడ్డి, నాగరాజు శర్మ, శ్రీరాం శ్రీనివాస్, కె.శ్రీనివాస్ రెడ్డి, పానుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోతన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి, జూలై 11 : పోతన స్మారక సమాధి వద్ద పర్యాటక శాఖ నిధులు నుంచి చేపడుతున్న అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మామి డాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బమ్మెర గ్రామంలోని పోతన స్మారక సమాధి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమీక్షించారు. భాగవత గ్రంధ కర్త పోతన జన్మించిన బమ్మెర గ్రామం పాలకుర్తినియోజకవర్గంలో ఉండటం తాను ఎమ్మెల్యేగా గెలవటం గర్వంగా ఉందన్నారు. అనంతరం పోతన ఆడిటోరియం ప్రాంగాణంలో కలెక్టర్ రిజ్వాన్ భాషాతో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మొక్కలు నాటారు. ఎస్ఈ నాగేందర్‌రావు, ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఈఈ దామోదర్‌రావు, హుస్సేన్, ఆర్‌అండ్‌బీ డీఈ జీవన్‌కుమార్ ఉన్నారు.